భోగభాగ్యాల భోగి



ఆదోనిలో భోగి మంటలు వేసుకున్న ప్రజలు

ఆదోని అర్బన్: పట్టణంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున ఆవుపేడతో ఇళ్ల ముందు అలికి రంగోలితో ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఉంచి మంగళహారతి ఇచ్చి భోగి మంటలు వేశారు. ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వకు శాకాంబరి అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అదేవిధంగా ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన గంగాభవానీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని ముద్దురంగా గురుస్వామి మఠంలో మహిళలు, యువత, చిన్నారులు వేకువజామున భోగి మంటలు వేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఉట్టిని చిన్నారులు కృష్ణుని వేశంలో కొట్టిన దృశ్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

నందవరం /గోనెగండ్ల: సంక్రాంతి పండుగ సంబరాల్లో మొదటి రోజు భోగి సోమవారం ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే తమ ఇళ్ల ముందు ముగ్గులు వేయగా, భోగి మంటలు వేసి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి చిన్న పెద్దలు సందడి చేశారు. సాయంత్రం చిన్నారుల రేగి పండ్లు, చాక్లెట్లు, చిల్లర నాణేలు కలిపి తలపై పోస్తూ పెద్దలు దీవించారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి

గోనెగండ్ల : మండల పరిధిలోని వేముగోడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ హసన్(80) అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతిచెందాడు. హసన్ గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడేవాడు. పలు రాజకీయ పార్టీ నాయకులు హసన్ స్వగృహానికి వెళ్లి నివాళులర్పించారు.

రథోత్సవం.. ఉప్పొంగిన భక్తిభావం

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం అంబాభవాని అమ్మవారి మహారథోత్సవం వేలాది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. సోమవారం పుష్య శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని వేకువ జామున నుంచి ఆలయ పీఠాధిపతులు శ్రీ మఠ్రిస్వాముల ఆధ్వర్యంలో కుంకుమార్చన, అభిషేకాలు, ఆకుపూజ, ఫలపుష్పాలు సమర్పించి వెండి కవచ అలంకరణ గావించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. గ్రామం నుంచే కాక కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు నుంచి భక్తులు తరలి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సంప్రదాయ బద్ధంగా వేడుకలు

సాయంత్రం సంప్రయబద్ధంగా గ్రామంలోని మేటి గౌళ్ల ఇంటి నుంచి పూర్ణకుంభాలతో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో తో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి అక్కడి నుంచి పీఠాధిపతులు శ్రీ మఠ్రిస్వాములు, ఆయన కుమారుడు శ్రీ కృష్ణస్వామిలను ఊరేగింపుగా రథశాల వరకు తీసుకొచ్చారు. అక్కడ రథానికి నైవేద్యం సమర్పించి పూజలు చేసి పీఠాధిపతులు ఉత్సవమూర్తితో రథంపై కొలువు తీరారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య మహా రథోత్సవాన్ని అమ్మ వారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు రథోత్సవం ఊరేగింపులో అరటి పళ్లు విసిరిగి మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో పాటు ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, మండల నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి, బుళ్ళి నరసింహులు, బండ్ల గోవిందు, దొడ్డి నరసన్న, కాల్వ లక్ష్మయ్య, పరుశురాం, ఎంపీటీసీ తాయమ్మ తదితరులు హాజరైయ్యారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కౌతాళం సీఐ అశోక్ కుమార్, కోసిగి , మాధవరం ఎస్ఐలు చంద్రమోహన్, విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



రథాన్ని లాగుతున్న భక్తులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆదోని టౌన్/ఆదోని రూరల్ /ఎమ్మిగనూరుటౌన్/గోనెగండ్ల : పెరిగిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, నాయకులు వీరేష్, సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేసి నిరసన తెలియజేశారు. అలాగే మండలంలోని పాండవగల్, కొత్తూరు, దొడ్డనకేరి, ఆరేకల్ గ్రామాల్లో సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు రామాంజనేయులు ఆధ్వర్యంలో, ఎమ్మిగనూరులో ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వాణి, ఈరమ్మ ఆధ్వర్యంలో, గోనెగండ్లలో సీపీఎం మండల కార్యదర్శి కరుణాకర్ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు.



ఆదోనిలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను వేస్తున్న సీపీఎం నాయకులు

క్రికెట్ పోటీలు

ఆదోని అర్బన్: పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో ఆదోని ఛాంపియన్‌షిప్ ట్రోఫీ -2025 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. సోమవారం మ్యాచ్‌లను ఆదోని క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్ ప్రారంభించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్ఎస్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల 1992–1993 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని అంజంతా ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. 33ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకొని నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు జి.హేమంత్‌కుమార్, యూ శ్రీనివాసులు, రజిత, సుచరిత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత సంఘం అధ్యక్షుడు రుద్రగౌడ్

పెద్దకడబూరు : మండల పరిధిలోని హనుమాపురం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి రథోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు పిండివంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా పూజారి చంద్రప్ప ఇంటి నుంచి మేటి కుంభాలతో ఊరేగింపుగా వచ్చి రథానికి ప్రత్యేక పూజలు గావించారు. మంగళహారతులు అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని రథంపై ఆశీనులు గావించి అశేష భక్తజనుల మధ్య ముందుకు కదలించారు. ఈ రథోత్సావాన్ని గ్రామ బొడ్రాయి వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, రాష్ట్ర వీరశైవ లింగాయత్ విభాగం అధ్యక్షుడు వై.రుద్రగౌడ్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఇంద్ర, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

15న స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: అవోపా ఆదోని వారి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసనం మందు 7వ విడత పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీన వికాస తరంగిణి, కాకుబాల్ నగేష్ వారి సహకారంతో పంపిణీ చేస్తున్నట్లు అవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా సోమవారం తెలిపారు. 15న ఉదయం 7 గంటలకు పట్టణంలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో చిన్నారులకు ఈ మందును అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 14వ తేదీలోపు 98494 78178 నంబర్‌కు వాట్సప్ ద్వారా మెసేజ్ కానీ, కాల్ చేసి పిల్లల పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలన్నారు.